పాలకవర్గానికి అభినందనలు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 19 : తుర్కయాంజాల్ రైతు సేవా సహకార సంఘం 4 సంవత్సరాలు పూర్తిచేసుకోవటం ఎంతో శుభసూచికమని డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. సోమవారం తుర్కయాంజాల్ సహకార సంఘం కార్యాలయంలో ఆయన పాలకవర్గంతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం పాలకవర్గం సభ్యులను అభినందించారు. నాలుగేళ్లల్లో రైతులకు అన్ని రకాల దీర్ఘకాలిక, పంట రుణాలతో పాటు, ఇతరత్రా రుణాలు అందజేసి రైతులను అభ్యున్నతికి కృషి చేయటంతో పాటు సంఘం అభివృద్ధికి కూడా కృషిచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాంరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మమ్మ, సంజీవ రెడ్డి, నర్సింగరావు, లక్ష్మారెడ్డి, స్వప్న, లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, రాంరెడ్డి, బార్గవి, పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం సీఐగా సైదిరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్, ఫిబ్రవరి 19 : ఇబ్రహీంపట్నం సీఐగా సైదిరెడ్డిని ప్రభుత్వం సోమవారం నియమించింది. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన ఆంజనేయులు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో మల్కాజ్‌గిరి సీసీఎస్ నుంచి ఇబ్రహీంపట్నానికి సైదిరెడ్డిని బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 19 : మండలంలోని చిన్నరావిరాల గ్రామంలో రూ. 2లక్షల మండల పరిషత్ నిధులతో నిధులతో నిర్మించనున్న వడ్డెర సంఘం భవనం ప్రహరీ నిర్మాణ పనులకు ఎంపీటీసీ దంతూరి అనితామహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వినోద, మాజీ సర్పంచ్ సూరకంటి వనజ, నాయకులు మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

పలు గ్రామ, పట్టణాల్లో శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు



శంకర్‌పల్లి: బుల్కాపూర్‌లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, ఫిబ్రవరి 19: ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా శంకర్‌పల్లి మండలంలోని బుల్కాపూర్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా చేవెళ్ల నియోజకవర్గంలోని షాబాద్, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లో శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, యువకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శివాజీ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

మంచాల: మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రధాన చౌరస్తాలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. అదేవిధంగా శివాజీ విగ్రహ ఏర్పాటు కోసం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రమేశ్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, యువజన సంఘం నాయకులు శేఖర్, ఎల్లేశ్, హిందుసేనా కార్యకర్తలు క్రాంతి, నరేశ్, కృష్ణ, మధు, గ్రామస్తులు కొత్తపల్లి సాయిగౌడ్, శివకుమార్, హరీశ్‌రెడ్డి, అఖిల్, కొత్తపల్లి విష్ణు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శివాజీ అందరికీ స్ఫూర్తి

పెద్దఅంబర్‌పేట : ఛత్రపతి శివాజీ అందరికీ స్ఫూర్తిదాయకమని తారామతిపేట ఎంపీటీసీ చేగూరి వెంకటేశ్‌యాదవ్ అన్నారు. మున్సిపాలిటీతోపాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని తారామతిపేట, కుత్బుల్లాపూర్‌లో సోమవారం శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పలుచోట్లో శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు.

ఇబ్రహీంపట్నంరూరల్ : ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన విగ్రహానికి ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆరె కటిక సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు దండేటి కార్ రవి, సంఘం నాయకులు లక్ష్మణ్, హరినారాయణ, శివకరుమార్, జహంగీర్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

శివాజీ విగ్రహావిష్కరణ

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామంలోని యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని పలువురు నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విగ్రహ ఏర్పాటుకు సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దూరి అశోక్‌గౌడ్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా మండల ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరె కటిక సంఘం మండల అధ్యక్షుడు మల్కేడి శ్రీను, నాయకులు శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, సంఘం ఉపాధ్యక్షుడు రమేశ్, కార్యవర్గ సభ్యులు విజయ్, నిరంజన్, యాదిలాల్, శ్రీధర్, శంకర్, సుభాశ్, కార్తిక్, నాగులు, శ్రీనివాస్, కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ పట్టణంలో శివాజీ చిత్ర పటం వద్ద ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్, నాయకులు

కడ్తాల్: కడ్తాల్ పట్టణంలో ఏబీవీపీ కడ్తాల్ శాఖ ఆధ్వర్యంలో శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు క్యామ శ్రీకాంత్, ఏబీవీపీ నాయకులు మురళీ, నరేందర్, మహేశ్, అశోక్, విజయ్, మహేందర్, అర్జున్, తరుణ్, సాయి, అజిత్, శివ, నవీన్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు పట్టణంలో..

కొత్తూరు : కొత్తూరు పట్టణంలోని హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివకుమార్‌చారి, నరేశ్‌చారి, మురళి, రాంజీ, రాజుగౌడ్, రాఘవేందర్, హర్షవర్ధన్, సందీప్, రఘు, కృష్ణ, శేఖర్, నీలకంఠం, రాజేందర్ పాల్గొన్నారు.

ఆమనగల్లు పట్టణంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆరె కటిక సంఘం నాయకులు

షాబాద్: పెద్దవేడులో శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

తారామతిపేటలో శివాజీ చిత్రపటానికి నివాళి



చేవెళ్ల టౌన్: ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు

మంచాల : శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

దశలవారీగా నియోజకవర్గం అభివృద్ధి

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 19 : ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ప్రభుత్వ సహకారంతో దశల వారీగా అభివృద్ధి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని 21,22,23 వార్డుల్లో సుమారు రూ.4.68కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చటంతో పాటు అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేస్తామన్నారు. నియోజకవర్గం పరిధిలోని నాలుగు మున్సిపాలిటీల్లోని కొత్తగా విస్తరిస్తున్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించటం కోసం నిధులు కేటాయిస్తామన్నారు. నియోజకవర్గంలో తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట్‌మున్సిపాలిటీలు శరవేగంగా విస్తరిస్తున్నాయని, వీటిలో తాగునీరు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి సదుపాయాలతో పాటు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కౌన్సిలర్లు ఐలయ్య, మంగమ్మ, శ్రీలత, కల్యాణ్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు చిలుక మధుసూదన్‌రెడ్డి, బీంరెడ్డితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విజయలక్ష్మి

బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మిని సన్మానించిన హెల్త్ సూపర్‌వైజర్లు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 19: షాద్‌నగర్ నూతన డిప్యూటీ డీఎంహెచ్‌వోగా విజయలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల హెల్త్ సూపర్‌వైజర్లు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో విధులు నిర్వహిస్తున్న తనకు డిప్యూటీ డీఎంహెచ్‌వోగా అదనపు బాధ్యలు ఇవ్వడం జరిగిందన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు నిర్వహించిన ఎస్ జయలక్ష్మి భద్రాద్రి కొత్తగూడెంకు వెళ్లారని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

చేవెళ్లరూరల్, ఫిబ్రవరి 19 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తంగడిపల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ అన్నారు. చేవెళ్ల మండల పరిధి తంగడిపల్లి జడ్పీహెచ్‌లో సోమవారం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత శ్రీనివాస్ చారి ఉచితంగా స్టడీమెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్కును కాపాడండి

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 19: పెద్దఅంబర్‌పేట లుంబినీ హిల్స్ కాలనీలోని పార్కును కాపాడాలని అసోసియేషన్ ప్రతినిధులు రంగారెడ్డి కలెక్టర్ శశాంకను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలోని పార్కులో ఉన్న మొక్కలను ధ్వంసం చేయడంతోపాటు కబ్జాకు యత్నిస్తున్నారని, దీన్ని కాపాడాలని విజ్ఞప్తిచేశారు. పార్కును ధ్వంసం చేసి, కబ్జాకు యత్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో లుంబినీ హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురకంటి కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ కృష్ణారెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు ఉన్నారు.

పాఠశాలకు ప్రొజెక్టర్, క్రీడా సామగ్రి బహూకరణ

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 19: ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు ఐ-సడక్ సంస్థ, జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వేస్ ప్రైవేట్ లిమిటెడ్(జేఈపీఎల్)రాయికల్ టోల్ ప్లాజా ఆధ్వర్యంలో సోమవారం ప్రొజెక్టర్, క్రీడా సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా టోల్ ప్లాజా మేనేజర్ ఇబ్రహీం, సంస్థ స్టేట్ మేనజర్ భానుప్రకాష్ మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిత ఉందని, పట్టుదల, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్, అడ్మిన్ జగదీశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీశ్, కరుణశ్రీ, ఉపాధ్యాయులు వినయశీల, రామేశ్వరి, కరుణశ్రీ, రేవతి, జ్యోతి, నీల్యా, సర్ఫరాజ్ పాల్గొన్నారు.

తాగిన మైకంలో తల్లిదండ్రులపై దాడి

కేసు నమోదు చేసిన షాబాద్ పోలీసులు

షాబాద్, ఫిబ్రవరి 19 : తాగిన మైకంలో కన్న తల్లిదండ్రులపై కొడుకు దాడి చేసి గాయపరిచిన ఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కేసారం గ్రామానికి చెందిన తొంట భీమయ్య ఆలియాస్ భారత్ ఈ నెల 18వ తేదీన ఆదివారం మద్యం సేవించి తాగిన మైకంలో తల్లిదండ్రులు పెంటయ్య, లక్ష్మమ్మలపై కర్రతో దాడి చేసి గాయపరిచాడు. కొన్ని రోజులుగా తాగుడుకు బానిసై తల్లిదండ్రులను చిత్రహింసలకు గురి చేస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. కన్న తల్లిదండ్రులకు పట్టెడన్నం పెట్టెదిపోయి వారిని ఇష్టం వచ్చినట్లు కొడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, ఈ విషయమై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు అతడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి19: ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనరసింహారెడ్డి సహకారంతో స్టేషనరీ, ఎగ్జామ్ ప్యాడ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యాదగిరి, ఉపాధ్యాయురాలు వేదశ్రీ, రాజేశ్‌గౌడ్, గోవర్ధన్, దేవేందర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లతో గ్రామాల రూపురేఖల్లో మార్పు

కడ్తాల్, ఫిబ్రవరి 19 : సీసీ రోడ్ల నిర్మాణంతో గిరిజన తండాల రూపురేఖల్లో మార్పు వస్తుందని ఎంపీపీ కమ్లీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బోణి గుట్ట తండాలో ఎంపీపీ నిధులు రూ. 5లక్షలతో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ కమ్లీ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తండాల్లో మరిన్ని సీసీ రోడ్లు రావడానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బరాములు, నాయకులు సోమ్లానాయక్, మోతీలాల్, విజేందర్, రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి19 : పంజాబ్ నేషనల్ బ్యాంక్ హైదరాబాద్ సర్కిల్ నూతన శాఖను రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సోమవారం హైదరాబాద్ జోనల్ మేనేజర్ దీపక్‌కుమార్ శ్రీవాస్తవ, సర్కిల్ హెడ్ ఎన్వీఎస్ ప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ రుణగ్రహీతలకు రూ.1.20కోట్ల మేరకు రిటైల్ రుణాలను మంజూరుచేసి అందజేశారు. పీఎన్‌బీ మొబైల్ ఏటీఎమ్‌ను పీఎన్‌బీ వినియోగదారుడైన ఎమ్‌ఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మేడా రఘునాథరెడ్డి ప్రారంభింపజేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ భారతదేశంలోనే రెండవ అతిపెద్ద పబ్లిక్ సెక్టార్ బ్యాంక్ అని జీఎం దీపక్‌కుమార్ తెలిపారు. బ్యాంకింగ్ సేవలను అన్ని వర్గాల ప్రజలకు చేరువచేసి ఉత్తమమైన సేవలందించే లక్ష్యంతో మొబైల్ ఏటీఎమ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిరి సంపద హోమ్స్ ప్రతినిధి ఎ.వెంకట్‌రెడ్డి, సిలికాన్ రిసార్ట్స్ ప్రతినిధి వెంకట నరసయ్యతో పాటు ఇతర బ్రాంచ్‌ల అధికారులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మస్థైర్యం పెరుగుతుంది

మొయినాబాద్‌లోని తోలుకట్టా పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి

మొయినాబాద్, ఫిబ్రవరి 19 : కరాటేతో బాలికలకు ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల బాలికల/కళాశాల ప్రిన్సిపాల్ డి.రమాదేవి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో ఉన్న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో 4వ జాతీయ తైక్వాండో -డు చాంపియన్ షిప్ -2024 రుద్రమ్మదేవి షోటోఖాన్ కరాటే డూ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో కరాటే రాష్ట్రస్థాయి పోటీల్లో మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ సమీపంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన బాలికలకు 21 మంది పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు నాలుగవ స్థానంలో నిలిచి మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు పొందారు. పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న సంజన, రిత్విక, స్నేహ, దీక్షితలు బంగారు పతకాలు సాధించగా, ఏడుగురు విద్యార్థినులు వెండి పతకాలు, 10 మంది విద్యార్థినులు కాంస్య పతకాలను సాధించి ఓవరాల్‌గా ట్రోఫీ కైవసం చేసుకున్నారు. కరాటే ప్రారంభోత్సవ కార్యక్రమంలో రుద్రమ్మదేవి షోటోఖాన్ కరాటే డూ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ సుమన్‌తల్వార్, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ వి.రవి, ఎక్జామినర్లు షిహాన్, ఎన్.లక్ష్మి, ప్రధానకార్యదర్శి రాజేందర్ ట్రోఫీలను అందించి విద్యార్థులను అభినందించారు.

కరాటేలో సత్తాచాటిన జాఫర్‌గూడ విద్యుర్థులు

అబ్దుల్లాపూర్‌మెట్ : జాఫర్‌గూడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో రాణిస్తున్నారు. ఇటీవల నగరంలో జరిగిన నాలుగవ జాతీయ స్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో డీపీఎస్ చిల్డ్రన్ విద్యార్థులు తమ సత్తాను చాటారు. 13 మంది చిన్నారి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా 1 గోల్డ్, 3 సిల్వర్, 9 బ్రాంజ్ మెడల్స్‌ను విద్యార్థులు దక్కించుకున్నారు. విద్యార్థులను పాఠశాల చాన్సిలర్ ముత్యంశెట్టి విజయనిర్మల, కార్యదర్శి ఎం కృష్ణారావు, సీఈవో అఖిల అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ఆమనగల్లు విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు : జాతీయస్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రానికి చెందిన సోను కరాటే అకాడమి విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన రుద్రమదేవి మెగా కప్ నాలుగో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తెలంగాణ గ్రాండ్ ఛాంపియన్‌గా నిలించింది. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలు, వివిధ జిల్లాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల కేంద్రానికి చెందిన సోను కరాటే అకాడమీ చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు, రజత, మరియు కాంస్య పతకాలు సాధించినట్లు మాస్టర్ సోను తెలిపారు. ఈ పతకాలు సాధించిన వారికి సినీనటుడు సుమన్ పతకాలు అందజేసి అభినందించినట్లు మాస్టర్ సోను తెలిపారు.

కొందుర్గు ఐరన్ పరిశ్రమలో ప్రమాదం

పలువురు కార్మికులకు గాయాలు

షాద్‌నగర్, ఫిబ్రవరి 19 : ఐరన్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తుండగా ప్రమాదం జరిగి పలువురు కార్మికులు గాయపడిన సంఘటన కొందుర్గులో సోమవారం జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు గ్రామపంచాయతీ పరిధిలో గత కొంతకాలంగా స్కాన్ ఎనర్జీ పవర్ లిమిటెడ్ పేరుతో ఐరన్ పరిశ్రమ కొనసాగుతున్నది. ఇందులో భాగంగానే పరిశ్రమలో కార్మికులు విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా ఐరన్ ఫర్నేస్ పేలింది. ఈ ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు కాగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయాన్ని గమనించిన పరిశ్రమ సిబ్బంది, తోటి కార్మికులు గాయపడిన కార్మికులను షాద్‌నగర్ సర్కారు దవాఖానకు తరలించి వైద్యాన్ని అందించారు. పరిశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, షాద్‌నగర్ పారిశ్రామిక వాడలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. సంఘటనా స్థలాన్ని కొందుర్గు పోలీసులు పరిశీలించారు. పరిశ్రమల నిర్వహణ శాఖ అధికారి మనోహర్‌రెడ్డి పరిశ్రమను సందర్శించి ప్రమాదానికి గల కారణాలు, గాయపడిన కార్మికుల వివరాలను తెలుసుకున్నారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని పరిశ్రమ యాజమాన్యానికి సూచించారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రావొద్దు

యాచారం, ఫిబ్రవరి19: మండలంలోని అన్ని గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేవాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి ఎద్దడిలేకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.